# గురుతత్వమసి

ఆరోజు గురువుగారు "భక్తి తత్వం" గురించి ఒక క్లాసు తీసుకున్నారు.

"భక్తి అంటే అస్తమానూ, అదే పనిగా దేవుడికి పూజ చెయ్యడం కాదు. ముందు మన పన్లు చేసుకుంటూ, ఖాళీ సమయంలో ఒక హాబీగా పూజ చెయ్యాలి" గురువుగారు చెప్పింది విన్నాక శిష్యుడికో సందేహం వచ్చింది. అదే అడిగాడు.

"బ్రేక్‌ఫాస్ట్ అయిన తర్వాత పూజ చెయ్యొచ్చా!"

"ఏం తప్పులేదు. రెండేసి రకాలు టిఫిన్లు ఒకేసారి తిని, పూజ చెయ్యకూడదు. వాంతవుతే పట్టుబట్టలు పాడవుతాయి. అందుకని ఒకే రకం తినాలి" గురువు సమాధానం.

"శివాయ విష్ణురూపాయ, విష్ణురూపాయ శివయే" అంటారు కదా! ఇది నిజమేనా!" శిష్యుడి మరో సందేహం.

"చాలా తప్పు. వీళ్ళ తత్వాలే వేరు. శివుడిది అర్థనారీశ్వరతత్వం. విష్ణుతత్వం యిదమిద్ధమని చెప్పలేం. ఆయనకి చాలా మంది భార్యలు కదా. ఎంతమందికని తన శరీరంలో భాగం యిస్తాడు. అందుకని ఎవరికి వారు! అందుకనే కార్తీక మాసంలో విష్ణువుని, ధనుర్మాసంలో శివుడ్ని పూజింపకూడదు. పైగా శివరాత్రినాడు, ఏ కారణం చేతనైనా విష్ణువు ప్రత్యక్షమైనా, ఎవరో తెలియనట్లు నటించాలి. అలాగే వైకుంఠ ఏకాదశినాడు శివుడు ఎవ్వరో తెలియనట్లుండాలి. అందుకనే "భజన చేసే విధము తెలియండి" అనే కీర్తన.

"తత్వమసి" అంటే ఏమిటి గురువుగారూ!

"పురాతన ధర్మాన్ని మసి చెయ్యడం అప్పుడు యిక ఆ తత్వ విచారణ ఉండదు. ప్రస్తుత కాలానుగుణంగా బ్రతికెయ్యొచ్చు" ధర్మసూక్ష్మాన్ని వివరించారు గురువు.

"చాలా సంతోషం గురువుగారు. మీరు చెప్పినట్లు ఒక ఆశ్రమం స్థాపించాను. చాలా విరాళాలు వస్తున్నాయి. కాని చాలా మంది విరాళాలు ఎక్కువిచ్చిన వారినే చూసి, నవ్వు చిందిస్తున్నానని నింద వేస్తున్నారు. దీనికేం చెయ్యాలి గురువుదేవా?"

"అమాయకుడా! అందుకనే నాలా పెద్ద గెడ్డం పెంచెయ్యి. దీనివల్ల అసలు నవ్వుతున్నామా. నవ్వితే ఎవర్ని చూసి నవ్వుతున్నాం అన్న విషయం ఎవ్వరికీ తెలియదు".

"ఔను! ఇంతకీ నువ్వు ఇస్తానన్న రెండులక్షల విరాళం తెచ్చావా?"

"గురు తత్వమసి!" నింపాదిగా చెప్పాడు, శిష్యుడు.

(చతుర, మే 2006)